# సాక్షి
# నిజామాబాద్

గురువారం । 22 । మే । 2025






### తెలుగు భాషకు..

తెలుగు భాషకు అన్ని స్థాయిల్లో ప్రాధాన్యం ఇవ్వాలని తెలుగు అధ్యాపకుల వార్షిక సదస్సులో అధ్యాపకులు అభిప్రాయపడ్డారు.

- 8లో ▸



### అద్దెకు కాడెడ్లు

వ్యవసాయం చేసేందుకు ఎన్ని ఆధునిక యంత్రాలు ఉన్నా.. పసుపు, మొక్కజొన్న సోయా విత్తడానికి ఎడ్లు తప్పనిసరి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.8 /21.6

### వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

## న్యూస్‌రీల్

### గంజాయి నిర్మూలనకు పటిష్ట నిఘా



**ధర్పల్లి/డిచ్‌పల్లి:** జిల్లాలో గంజాయి నిర్మూలనకు పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని పోలీస్ కమిషనర్ పి సాయిచైతన్య అన్నారు. ధర్పల్లి, డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లను సీపీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్లు, రికార్డులను పరిశీలించి కంప్యూటర్ సిబ్బంది పనితీరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫైవ్ ఎస్ అమలు విధానాన్ని పరిశీలించారు. సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ గేమ్‌లపై ప్రజలను ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. సిబ్బందితో మాట్లాడి వారి సాధకబాధకాలను తెలుసుకున్నారు. సీపీ వెంట సీఐలు భిక్షపతి, మల్లేశ్, ఎస్సైలు రామకృష్ణ , ఎండీ షరీఫ్, సిబ్బంది ఉన్నారు.

### నిజామాబాద్ రూరల్ ఏడీఏ సస్పెన్షన్

**డొంకేశ్వర్(ఆర్మూర్):** వ్యవసాయ శాఖ నిజామాబాద్ రూరల్ ఏడీఏ ప్రదీప్ కుమార్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సొంత శాఖకు చెందిన ధర్పల్లి ఏవో ప్రవీణ్ గతేడాది గుండెపోటుతో మరణించాడు. ఆయన కుటుంబానికి రావాల్సిన బెనిఫిట్స్ రాకుండా రూరల్ ఏడీఏ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపణలు వచ్చాయి. రాష్ట్ర శాఖ నుంచి ఇద్దరు అధికారులు జిల్లాకు వచ్చి విచారణ చేసి కమిషనర్‌కు నివేదిక అందజేశారు. నివేదిక ఆధారంగా ఏడీఏను సస్పెండ్ చేశారు.

### వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

- డీపీవో శ్రీనివాస్



**ఇందల్వాయి:** వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సూచించారు. ఇందల్వాయి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ సకాలంలో పంచాయతీకి హాజరై పారిశుధ్య పనులను నిత్యం పరిశీలించాలన్నారు. ప్రతి గ్రామాన్ని గరిష్టంగా నాలుగు జోన్‌లుగా విభజించి, రోజుకో జోన్ చొప్పున పారిశుధ్య పనులను చూడాలని, స్వచ్ఛత, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని భాగస్వాములను చేయాలన్నారు. సకాలంలో ఇంటి పన్నులు వసూలు చేయాలని, 15 రోజుల్లో ఇంటి నిర్మాణ పనులకు అనుమతులు ఇవ్వాలని, లేదంటే సహేతుకమైన కారణాలు చెప్పి తిరస్కరించాలని సూచించారు. పౌర సేవల్లో జాప్యం వహించొద్దని అన్నారు. సమావేశంలో ఎంపీడీవో అనంత్‌రావు, ఎంపీవో రాజ్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్య కేంద్రం పరిశీలన



**ఇందల్వాయి:** ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మాతా శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ సుప్రియ బుధవారం పరిశీలించారు. అమ్మఒడి సేవలు, అమలవుతున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణలందరికీ సకాలంలో వైద్య సేవలు అందేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలని, ప్రజలకు ప్రభుత్వ వైద్యసేవలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఈవో శంకర్, స్థానిక వైద్యాధికారి క్రిస్టినా, సిబ్బంది ఉన్నారు.



ఆర్మూర్‌లో తడిసిన ధాన్యం సంచులు



ఆర్మూర్‌లో ధాన్యం కుప్పల్లోకి వర్షపు నీరు వెళ్లకుండా పిల్ల కాలువ చేస్తున్న రైతు

## జిల్లాలో జోరు వాన

- ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో కురిసిన వర్షం
- ధర్పల్లిలో 76.5 మి.మీ. వర్షపాతం నమోదు

జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత మొదలైన వర్షం బుధవారం ఉదయం 10 గంటల వరకు కురిసింది. సగటున జిల్లా వ్యాప్తంగా 4 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో 12 మండలాల్లో అధికంగా వర్షం కురిసింది. అత్యధికంగా ధర్పల్లిలో 76.5 మి.మీటర్ల వర్షం కురవగా, నవీపేట్‌లో 24.0, జక్రాన్‌పల్లిలో 30.8, భీమ్‌గల్‌లో 36.0, నిజామాబాద్‌నార్త్‌లో 38.5, మోపాల్‌లో 47.4, వేల్పూర్‌లో 41.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. 21 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్, స్తంభాలు నేలకొరిగాయి. ఆరబోసిన వరిధాన్యం, సజ్జ పంట తడిసింది. – నిజామాబాద్‌అర్బన్




మెండోరా: వెల్కటూర్‌లో సజ్జ కంకుల చుట్టూ చేరిన నీరు



ఆర్మూర్‌లో కురుస్తున్న వర్షం

# ఉల్లంఘనులకు బాసటగా..

- అక్రమ నిర్మాణాలకు దన్నుగా నిలుస్తున్న నగరపాలక సంస్థ అధికారులు
- హైకోర్టు ఆదేశాలను సైతం అమలు చేయకుండా నోటీసులతో సరి
- సెటిల్‌మెంట్లు చేస్తున్న టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు



నిజామాబాద్ నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగంలో బేరం కుదిరిన ఫైళ్లకే తక్షణ అనుమతులు ఇస్తున్నారు. నిబంధనలు పట్టించుకోకుండా అక్రమ నిర్మాణాలకు దన్నుగా నిలబడుతున్నారు. కొంతమంది ఫిర్యాదు దారులు మాత్రమే హైకోర్టుకు వెళుతున్నారు. అయితే హైకోర్టు ఆదేశాలను సైతం అమలు చేయకుండా అధికారులు షోకాజ్ నోటీసులతో సరిపెడుతున్నారు.

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ :** నిజామాబాద్ నగరపాలక సంస్థలో టౌన్‌ప్లానింగ్ విభాగం ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా తయారైంది. ఒకే ఫైల్‌కు సంబంధించి పలుసార్లు తిరస్కరణలు చేస్తున్నారు. బేరం కుదిరిన తర్వాత తక్షణమే నిబంధనలు పాటించకున్నప్పటికీ అనుమతులు ఇస్తున్నారు. పైగా దగ్గరుండి మరీ అక్రమ నిర్మాణాలకు దన్నుగా నిలబడుతున్నారు. చివరకు హైకోర్టు ఆదేశాలను సైతం అమలు చేయకుండా ప్రత్యేక వ్యవస్థ మాదిరిగా వ్యవహారాలు నడిపిస్తున్నారు. వందలో పది శాతం లోపు ఫిర్యాదు దారులు మాత్రమే హైకోర్టుకు వెళుతున్నారు. హైకోర్టు ఆదేశాలను సైతం అమలు చేయకుండా ఉంటున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇతర ఫిర్యాదులనైతే ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

- ఖలీల్‌వాడిలో సెల్లార్ అనుమతి లేకుండా ఒక భవనం నిర్మాణం చేస్తున్నారు. దీనిపై 2024 డిసెంబర్ 31న మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు వచ్చింది. పట్టించుకోకపోవడంతో ఫిర్యాదు దారుడు హైకోర్టుకు వెళ్లాడు. దీంతో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేస్తున్న వ్యక్తికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. పనులు మాత్రం యథావిధిగా నడుస్తున్నాయి. దీనిపై చర్యలు తీసుకోడానికి బదులు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ రాజేష్ మాత్రం అనుమతులు లేకుండా నిర్మాణం చేస్తున్న వ్యక్తికి, ఫిర్యాదు దారుడికి మధ్య రాజీ కుదిర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.
- ఖలీల్‌వాడి ప్రాంతాన్ని బంగారు బాతు మాదిరిగా మున్సిపల్ అధికారులు వాడుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల టీపీబీవోలు, టీపీఎస్‌లు, ఏసీపీలను ఆయా ఏరియాల్లో మార్పులు చేసినప్పటికీ టీపీఎస్ రాజేష్‌ను మాత్రం ఎలాంటి మార్పు లేకుండా కొనసాగించడంపై విమర్శలు వస్తున్నాయి. ఖలీల్‌వాడి ప్రాంతంలో రాజేష్ ఇష్టం వచ్చినట్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు వరుసగా వస్తున్నాయి. ఈ విషయాలపై కమిషనర్‌ను సంప్రదించగా విచారణ చేస్తామని వెల్లడించారు.
- నగరంలోని దుబ్బ ఏరియాలో 3191/అ సర్వే నంబర్‌లో ఒక వ్యక్తికి చెందిన 32 గుంటల భూమిని మరో వ్యక్తి ఆక్రమించాడు. ఈ విషయమై బాధితుడు 2025 ఫిబ్రవరి 3న, 2025 మార్చి 25న నగరపాలక కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో అధికారులు 2025 ఏప్రిల్ 25 న ఇరుపార్టీలకు డాక్యుమెంట్లు తీసుకురావాలని నోటీసులు ఇచ్చారు. కాగా బాధితుడు హైకోర్టుకు వెళ్లాడు. ఆక్రమణదారుడిపై నాలుగు వారాల్లోగా చర్యలు తీసుకోవాలని, బాధితుడికి భూమి అప్పగించాలని కోర్టు మున్సిపల్ అధికారులకు రూలింగ్ ఇచ్చింది. కోర్టు రూలింగ్ మేరకు చర్యలు తీసుకోవడానికి బదులు మున్సిపల్ అధికారులు ఆక్రమణ దారుడికి ఈ నెల 13న షోకాజ్ నోటీసులు మాత్రం ఇచ్చి కాలం వెళ్లబుచ్చుతున్నారు.

# ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం రూ.18 వేలు లంచం తీసుకుంటూ దొరికిన వైనం
- రాంచంద్రాపల్లిలోని సొంతింట్లో సోదాలు



పంచాయతీ కార్యదర్శి గంగామోహన్

**మాక్లూర్:** ఇంటి స్థలం(ప్లాట్) రిజిస్ట్రేషన్ చేయించేందుకు రూ. 18 వేలు లంచం తీసుకుంటూ నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం గొట్టిముక్కల గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగామోహన్ బుధవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. దీంతో ఆయన స్వగ్రామం ఆలూర్ మండలం రాంచంద్రాపల్లిలోని సొంతింట్లో కూడా ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఐదేళ్లుగా గంగామోహన్ గొట్టిముక్కల పంచాయతీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈయన పంచాయతీ కార్యదర్శుల సంఘానికి మండల అధ్యక్షుడు కూడా. గొట్టిముక్కల గ్రామానికి చెందిన ముప్పిడి రాజేందర్ ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ విషయమై పంచాయతీ కార్యదర్శి గంగామోహన్‌ను సంప్రదించగా రూ. 25 వేలు లంచం డిమాండ్ చేశాడు. ఇద్దరి మధ్య రూ.18 వేలకు ఒప్పందం కుదిరింది. ముందుగా డబ్బులు చెల్లిస్తేనే ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయిస్తానని గంగామోహన్ కరాఖండిగా చెప్పడంతో బాధితుడు రాజేందర్ గత్యంతరం లేక ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు బుధవారం ముందుగానే గ్రామానికి చేరుకొని బాధితుడికి తగు సూచనలు ఇచ్చి పంపించారు. పకడ్బందీగా వ్యవహరించి గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో గంగామోహన్‌కు బాధితుడు రాజేందర్ లంచం డబ్బులు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గంగామోహన్‌పై గతంలో కూడా చాలా ఫిర్యాదులు వచ్చాయని ఏసీబీ డీఎస్పీ చంద్రశేఖర్‌గౌడ్ వెల్లడించారు. నిందితుడిని నాంపల్లి కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

# గుర్తింపు కార్డులు అందజేయాలి

**ఖలీల్‌వాడి:** భవన నిర్మాణ కార్మికులకు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు అందించాలని ఎక్సైజ్ కోర్టు జడ్జి హరికుమార్ అన్నారు. జిల్లా కోర్టులోని డీఎల్‌ఎస్‌ఏ కార్యాలయంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించగా, జడ్జి హరికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులకు తప్పనిసరిగా పింఛన్ అందేలా చూడాలన్నారు. అనంతరం లేబర్ ఆఫీసర్ యోహాన్ లేబర్ చట్టాలను వివరించారు. 60 ఏండ్లు నిండిన భవననిర్మాణ కార్మికులకు పింఛన్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో బార్ కార్యదర్శి మాణిక్‌రాజ్, న్యాయవాది రాజ్‌కుమార్ సుబేదార్ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జడ్జి హరికుమార్

# ప్రజల గుండెల్లో రాజీవ్‌గాంధీ

- యువతకు రాజకీయ అవకాశాలు కల్పించారు
- ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు
- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

**నిజామాబాద్ సిటీ:** దేశ మాజీ ప్రధాని, భారత రత్న స్వర్గీయ రాజీవ్‌గాంధీ దేశ ప్రజల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో రాజీవ్‌గాంధీ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి ఎమ్మెల్యేతోపాటు నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. 18 ఏళ్లకు ఓటుహక్కును కల్పించి యువత రాజకీయాల్లోకి వచ్చేలా చేశారన్నారు. ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికిన పాలనాదక్షుడని కొనియాడారు. జాతీయ విద్యా విధానం అమలు చేసి దేశాన్ని విద్యారంగంలో అగ్రపథాన నడిపారన్నారు. 40 ఏళ్లకే ప్రధానమంత్రి పదవిని చేపట్టి యువ ప్రధానిగా చరిత్రలో నిలిచారన్నారు. ఆయన భౌతికంగా లేకపోయినా ఆయన ఆశించిన సమాజం వాస్తవ రూపంలో కనిపిస్తోందన్నారు. రాజీవ్‌గాంధీ ఆలోచనలతో యువత ముందుకు వెళ్లాలన్నారు. వినాయక్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, పీసీసీ మాజీ కార్యదర్శి రామ్‌భూపాల్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గోపి, నాయకులు వేణురాజ్, నరేందర్‌గౌడ్, సేవాదళ్ సంతోష్, కోనేరు సాయికుమార్, బొబ్బిలి రామకృష్ణ, బోర్గాం శ్రీనివాస్, పోల ఉష, పుప్పాల విజయ, సుభాష్ జాదవ్, సలీం, అవిన్, సాయిలు, యెండల కిషన్, నికిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

# నగరంలో అధునాతన స్విమ్మింగ్‌పూల్

- రూ.15కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు
- గంగస్థాన్‌లోని సర్వే నంబర్ 106లో ప్రభుత్వ స్థలం కేటాయింపు



గంగస్థాన్ ఫేజ్–1 ప్రాంతంలో స్టేడియం కోసం కేటాయించిన స్థలం

**నిజామాబాద్ నాగారం:** నగరంలో అధునాతన హంగులతో ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం కాబోతోంది. ఈ మేరకు రూ.15కోట్లతో పనులు చేపట్టేందుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. మల్టీ పర్పస్ హాల్‌తోపాటు, చేంజింగ్ రూమ్స్, ఓపెన్ జిమ్ తదితర ఏర్పాట్లు చేయనున్నారు. గంగస్థాన్ ఫేజ్–1 ప్రాంతంలోని సర్వే నంబర్ 106లో ప్రభుత్వ భూమి సుమారు వంద ఎకరాలు ఉండగా, స్విమ్మింగ్ పూల్‌తోపాటు ఇతర నిర్మాణాల కోసం 7 ఎకరాల 30గుంటల భూమి అవసరం ఉంటుందని అంచనా వేశారు.

**కబ్జా నుంచి ప్రభుత్వ ఆధీనంలోకి..**

గంగస్థాన్ ఫేజ్–1 ప్రాంతంలో సర్వేనంబర్ 106లో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. ఇప్పటికే పలుచోట్ల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఒలింపిక్ అసోసియేషన్ భవనం, స్టేడియం నిర్మాణానికి ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్థలం కేటాయించింది. అప్పటి మంత్రి సుదర్శన్‌రెడ్డి భూమి పూజ సైతం చేశారు. ఒలింపిక్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించడంతో పనులను ప్రారంభించారు. పిల్లర్స్, బేస్‌మెంట్ వరకు సుమారు రూ.15లక్షల వరకు ఖర్చు చేశారు. అటు తర్వాత ఒలింపిక్ సంఘంలో విబేధాలు రావడంతోపాటు రాజకీయ మార్పుల నేపథ్యంలో పనులు నిలిచిపోయాయి. మరోవైపు భూమి కబ్జా అవుతుండడంతో ఒలింపిక్ సంఘం ప్రతినిధులు, క్రీడాకారులు, అధికారులు అడ్డుకునేందుకు చాలా శ్రమించారు. ప్రత్యేకంగా సర్వే అధికారులతో సర్వే చేయించి హద్దు రాళ్లు పెట్టారు. అయినప్పటికీ కబ్జాదారులు దొంగ పట్టాలు, పేపర్లు సృష్టించి నానా హంగామా చేశారు. ప్రజా సంఘాలు, ఒలింపిక్ సంఘం, క్రీడాకారులు, అధికార యంత్రాంగం కృషితో భూమి ప్రభుత్వం ఆధీనంలోకి వచ్చింది.

**సుమారు రూ.10 లక్షలతో ఫెన్సింగ్**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒలింపిక్ సంఘం, జిల్లా యంత్రాంగం కలిసి బోధన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డికి స్టేడియానికి కేటాయించిన భూమి అన్యాక్రాంతం అవుతున్న విషయాన్ని విన్నవించారు. ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మళ్లీ స్టేడియం కేటాయించిన స్థలాన్ని సర్వే చేయించారు. కలెక్టర్ నిధులు ఇవ్వడంతో సుమారు రూ.10లక్షలతో ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. సుమారు 7 ఎకరాల 30గుంటల భూమికి రక్షణ కల్పించారు.

**ప్రతిపాదనలు పంపించాం**



ముందుగా స్టేడియానికి కేటాయించిన స్థలాన్ని కాపాడేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు చుట్టూ ఫెన్సింగ్ వేశాం. స్విమ్మింగ్ పూల్, మల్టీపర్పస్ హాల్, చేంజింగ్ రూమ్స్, తదితర నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– ముత్తెన్న, జిల్లా యువజన క్రీడల అధికారి

# బదిలీపై వచ్చిన తహసీల్దార్లకు బాధ్యతలు

**నిజామాబాద్ అర్బన్:** బదిలీపై ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లకు బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మల్ జిల్లా నుంచి వచ్చిన శ్రీనివాస్‌ను వేల్పూర్ తహసీల్దార్‌గా, కామారెడ్డి జిల్లా నుంచి వచ్చిన కే సతీశ్‌రెడ్డిని డిచ్‌పల్లి తహసీల్దార్‌గా, జగిత్యాల జిల్లా నుంచి వచ్చిన ఎంకే ముంతాజ్ బుద్దీన్‌ను ముప్కాల్ తహసీల్దార్‌గా, జగిత్యాల జిల్లా నుంచి వచ్చిన జి ప్రసాద్‌ను కమ్మర్‌పల్లి తహసీల్దార్‌గా, వీర్‌సింగ్‌ను చందూర్ తహసీల్దార్‌గా నియమించారు.

**జిల్లాలో పలువురికి బదిలీ**

ఇదిలా ఉండగా జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు తహసీల్దార్లను సైతం బదిలీ చేశారు. టి శాంతను చందూర్ నుంచి ధర్పల్లికి, ఎస్ వెంకటేశంను వర్ని నుంచి ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి బదిలీ చేయగా, కలెక్టరేట్‌లో ఉన్న కే ధన్వాల్‌ను అక్కడే సూపరింటెండెంట్‌గా నియమించారు.

# పాము కాటుకు బాలుడు మృతి

**నస్రుల్లాబాద్ (బాన్సువాడ) :** పాము కాటుతో నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలోని సంగం గ్రామంలో అశోక్, సుజాత దంపతుల కుమారుడు రిషి కుమార్ బుధవారం ఇంట్లో ఆడుకుంటున్నాడు. బాలుడి కాలు నుంచి రక్తం కారుతుండటం గమనించిన తల్లి గాయం అయి ఉంటుందని భావించి పసుపు రాసింది. కొద్దిసేపటి తర్వాత బాబు కళ్లు తేలేయడంతో తల్లి భయానికి గురయ్యింది. అంతలోనే పాము కనబడటంతో పాము కరిచి ఉండవచ్చని బాలుడిని బాన్సువాడ ఆస్పత్రికి తీసుకెళ్లగా సిబ్బంది నిజామాబాద్‌కు వెళ్లమన్నారు. అప్పటికే శరీరం అంతా విషం వ్యాపించడంతో బాలుడు మృతి చెందాడు. ముగ్గురు కుమార్తెల తర్వాత ఎంతో కాలానికి కొడుకు పుట్టాడని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. గ్రామంలో కురిసిన భారీ వర్షానికి పాము ఇంట్లోకి వచ్చి ఉంటుందని, అంతలోనే ఘోరం జరిగిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.



రిషి కుమార్

## క్లుప్తంగా

### 'సాంకేతికతను పరిచయం చేసిన ఘనుడు రాజీవ్‌గాంధీ'



రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మోహన్‌రెడ్డి, కుంట రమేశ్‌రెడ్డి తదితరులు

సుభాష్‌నగర్: భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నగరంలోని వినాయక్‌నగర్ హనుమాన్ జంక్షన్‌లో ఉన్న ఆయన విగ్రహానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డితోకలిసి ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేశ్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి సాంకేతికతను పరిచయం చేసిన వ్యక్తి రాజీవ్‌గాంధీ అని, గ్రామీణ విద్యాభివృద్ధిని ప్రోత్సహించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రాంభూపాల్, కాంగ్రెస్ ఫిషర్‌మన్ చైర్మన్ బోర్గాం శ్రీనివాస్, నరేందర్ గౌడ్, రామకృష్ణ, వేణురాజ్ తదితరులు పాల్గొన్నారు.

### నేత్రదానం

బోధన్: పట్టణంలోని అనిల్ టాకీస్ రోడ్డులోని లక్ష్మి అపార్టుమెంట్ నివాసీ ఎన్ రమేశ్(59) బుధవారం మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులు రమేశ్ నేత్రాలు దానం చేయాలని నిర్ణయించుకొని బోధన్ లయన్స్ కంటి ఆస్పత్రికి సమాచారం అందించారు. ఈ మేరకు మృతుడి రెండు కళ్లను వైద్యులు సేకరించారని లయన్స్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపకుడు పోలవరపు బసవేశ్వర్ రావు తెలిపారు.

### సైబర్ నేరగాళ్ల నుంచి రూ.5.80 లక్షలు రికవరీ

- పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన బాధితుడు

కామారెడ్డి క్రైం: ఓ వ్యక్తికి వాట్సాప్ వీడియో కాల్ చేస్తూ పోలీసులమని చెప్పి బెదిరింపులకు పాల్పడి అతని అకౌంట్లో నుంచి రూ.5.80 లక్షలు సైబర్ నేరగాళ్లు కాజేయగా, వెంటనే స్పందించి డబ్బులు మొత్తం రికవరీ చేశారు కామారెడ్డి పోలీసులు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన లోకుల రాజేందర్ అనే వ్యక్తికి బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు వాట్సాప్ వీడియో కాల్ చేశారు. తాము ముంబై పోలీసులమని నమ్మించారు. టెలికాం సర్వీస్ ద్వారా మీ ఆధార్ కార్డుతో మరొకరు డబ్బులు తీసుకున్నారని, మీపై మనీ లాండరింగ్ కేసు నమోదైందని భయభ్రాంతులకు గురిచేశారు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ ఫోన్ చేసి మీ అకౌంట్‌లో ఉన్న డబ్బులు మొత్తం తమ అకౌంట్‌కు బదిలీ చేయాలని, లేకపోతే అరెస్టు చేస్తామని బెదిరించారు. భయపడిన రాజేందర్ తన అకౌంట్లోని రూ.5.80 లక్షలు సైబర్ నేరగాళ్లు చెప్పిన అకౌంట్‌కు బదిలీ చేశాడు. కొద్దిసేపటి తర్వాత అనుమానం వచ్చి పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సదరు బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేసి, డబ్బులు రికవరీ చేసి బాధితుని అకౌంట్లో జమ చేశారు. దీంతో బాధితుడు రాజేందర్ పట్టణ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వెల్లడించారు.

### పెళ్లి కుదరడం లేదని..



రాజ్‌కుమార్ మృతదేహం

కమ్మర్‌పల్లి: పెళ్లి సంబంధాలు కుదరడం లేదని బాధపడుతూ ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కమ్మర్‌పల్లి మండలం ఇనాయత్‌నగర్‌లో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఇనాయత్‌నగర్ గ్రామానికి చెందిన జక్కుల రాజ్‌కుమార్(23)కు కుటుంబసభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో సోమవారం సాయంత్రం ఇంట్లో ఉన్న గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మంగళవారం అర్ధరాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# అద్దెకు కాడెడ్లు

- జత ఎడ్లకు నెలకు రూ.20 వేల కిరాయి
- అడ్వాన్సు రూ. 50 వేలు
- పసుపు విత్తడంలో అరకలు కీలకం

బాల్కొండ: వ్యవసాయం చేసేందుకు ఎన్ని యంత్రాలు ఉన్నా.. పసుపు, మక్కజొన్న, సోయా విత్తడానికి ఎడ్లు తప్పనిసరి. రైతులు ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. దీంతో అరకల కోసం ఎడ్లను అద్దెకు తీసుకుంటున్నారు. ఈ కాడెడ్లు అద్దెకు ఇవ్వడంలో బాల్కొండ మండలం కేరాఫ్‌గా నిలుస్తోంది. గతంలో మండల కేంద్రంలో ఎడ్ల సంత నిర్వహించే వారు. ప్రస్తుతం సంత మూత పడటంతో ఇళ్ల వద్దనే ఎడ్లను అద్దెకు ఇస్తున్నారు. వచ్చే వారంలో రైతులు పసుపు పంటను వేసేందుకు అరకలు అవసరం ఉంటుంది. దీంతో నలుగురు రైతులు కలిసి ఎడ్లను నెల కోసం కిరాయికి తీసుకెళ్తారు. బాల్కొండలో ఒక్కో వ్యాపారి వద్ద 10 నుంచి 15 జతల ఎడ్లు ఉన్నాయి. జత ఎడ్లను నెలకు రూ. 20 వేల కిరాయితో ఇస్తున్నారు. రెండు ఎడ్లకు రూ. 50 వేలు అడ్వాన్స్‌గా తీసుకుంటున్నారు.

### సిద్ధంగా ఉన్నాయి



ప్రస్తుతం రైతులు పసుపు పంట వేస్తారు. ఆ పంటకు అరకలు అవసరం. ఏటా రైతులకు కిరాయిపై ఎడ్లను ఇస్తాం. నెల రోజులకు రూ. 20 వేలు కిరాయి తీసుకుంటాం. అద్దెకు ఎడ్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి.

– నయీం, బాల్కొండ

## తెలుగు భాషకు ప్రాధాన్యమివ్వాలి



తెలుగు అధ్యాపకుల వార్షిక సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు

తెయూ (డిచ్‌పల్లి): తెలుగు భాషకు అన్ని స్థాయిల్లో తప్పకుండా ప్రాధాన్యం ఇవ్వాలని వివిధ కళాశాలల అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల సెమినార్ హాల్లో తెలుగు శాఖ విభాగాధిపతి సీహెచ్ లక్ష్మణ్ చక్రవర్తి అధ్యక్షతన తెలుగు అధ్యాపకుల వార్షిక సదస్సును బుధవారం నిర్వహించారు. సదస్సులో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. డిగ్రీ కళాశాలల్లో ఇప్పటి వరకు ద్వితీయ భాషగా తెలుగు, మూడు సంవత్సరాలు, 20 క్రెడిట్స్‌తో ఉంది. కానీ, వచ్చే విద్యా సంవత్సరం నుంచి దాన్ని రెండు సంవత్సరాలకు తగ్గించి, 12 క్రెడిట్స్‌కు పరిమితం చేయాలని ఉన్నత విద్యామండలి అధ్యక్షులు ఇటీవల జరిపిన ఆన్‌లైన్ సమావేశంలో నిర్ణయించడాన్ని అధ్యాపకులు ముక్తకంఠంతో ఖండించారు. యూజీసీ నిబంధనలను అనుసరించి భాష, సాహిత్యాలలో పీజీ కోర్సు చేయాలంటే డిగ్రీ స్థాయిలో తప్పనిసరి 20 క్రెడిట్లు ఉండాలనే నియమం ఉందని గుర్తుచేశారు. డిగ్రీ స్థాయిలో తెలుగు సబ్జెక్టును కోర్ సబ్జెక్టుగా దోస్త్‌లో సోషల్ సైన్సెస్, కామర్స్ కోర్సులలో బకెట్ సిస్టంలో చేర్చాలని, ఆసక్తి ఉన్న విద్యార్థులు తెలుగు చదువుకునే అవకాశం కల్పించాలన్నారు. తెలుగు భాషను 'ఉద్యోగం' అనే దృష్టికోణం నుంచి చూడడం ప్రభుత్వాలు మానుకోవాలన్నారు. విద్యార్థుల్ని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి సాహిత్య బోధన ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీన్ ఆచార్య కే లావణ్య, ఆచార్య పీ కనకయ్య, వివిధ కళాశాలల తెలుగు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## పనులు నాణ్యతగా చేయించుకోవాలి

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

వర్ని: అభివృద్ధి పనులను గ్రామస్తులు దగ్గరుండి నాణ్యతగా చేయించుకోవాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. వర్ని మండలం హుమ్నాపూర్ గ్రామంలో రూ. 50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు పనులు జరిగే సమయంలో అందుబాటులో ఉండి నిబంధనల ప్రకారం నాణ్యతగా పనులు చేయించాలని సూచించారు. నాణ్యతకు తిలోదకాలిస్తే కాంట్రాక్టర్‌తో పాటు అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్ రెడ్డి, తహసీల్దార్ సాయిలు, వర్ని ఏఎంసీ చైర్మన్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ టీచర్ సస్పెండ్

నిజామాబాద్‌అర్బన్: శిక్షణ కార్యక్రమంలో అనుచితంగా ప్రవర్తించిన టీచర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు. మెండోరా మండలం బుస్సాపూర్ పాఠశాలకు చెందిన ఫిజికల్ సైన్సు టీచర్ నవీన్‌కుమార్ శిక్షణ కార్యక్రమంలో అనుచితంగా ప్రవర్తించాడు. శిక్షణ సెంటర్ కో–ఆర్డినేటర్లతోపాటు రీసోర్స్ పర్సన్‌లపై తిట్ల దండకం అందుకొని, మధ్యాహ్న భోజనం, చాయ్ ఎందుకు ఇవ్వడం లేదంటూ నిర్వాహకులు, డీఈవోపై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. దీంతో విచారణ చేపట్టిన అధికారులు నవీన్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ విషయమై విద్యాశాఖ కమ్యూనిటీ కోఆర్డీనేటర్ శ్రీనివాస్‌ను వివరణ కోరాగా నవీన్ అనుచిత ప్రవర్తనతో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

## క్రైం కార్నర్

## అనుమానాస్పదస్థితిలో బాలింత మృతి

- అత్తింటి వారే కొట్టి చంపేశారని కుటుంబీకుల ఆరోపణ
- తీవ్ర ఉద్రిక్తత.. భారీ పోలీస్ బందోబస్తు



పూజ (ఫైల్)



ఆందోళన చేస్తున్న పూజ కుటుంబసభ్యులు

ఆర్మూర్‌టౌన్ : అనుమానాస్పద స్థితిలో ఓ బాలింత మృతి చెందిన ఘటన ఆర్మూర్ పట్టణంలోని వడ్డెర కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామానికి చెందిన పూజ(27)కు ఎనిమిదేళ్ల క్రితం ఆర్మూర్ పట్టణానికి చెందిన సాయిలుతో వివాహమైంది. వీరికి ఆరేళ్ల కూతురు రష్మిత ఉండగా, రెండు నెలల క్రితం కొడుకు పుట్టాడు. భర్త సాయిలు నెల రోజుల క్రితం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. కాగా, మంగళవారం సాయంత్రం ఇంట్లో గొడవ జరగడంతో అత్త నర్సవ్వ, మరిది అశోక్, ఆడపడుచు శైలజ రాత్రి పూజను తీవ్రంగా కొట్టినట్లు కూతురు రష్మిత తెలిపింది. పెళ్లయిన నాటి నుంచి అదనపు కట్నం కోసం భర్త సాయిలు, అత్త నర్సవ్వ, ఆడపడుచు శైలజ, మరిది అశోక్ వేధింపులకు గురి చేస్తుండే వారని పూజ కుటుంబీకులు ఆరోపించారు. పూజ మృతి విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వడ్డెర కాలనీకి చేరుకున్నారు. తమ కూతురును అత్తింటి వారే కొట్టి చంపారని, వారిని తమకు అప్పగించాలని ఆందోళనకు దిగారు. దీంతో ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది భారీగా మోహరించారు. ఉద్రిక్తతల నడుమ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

### రామడుగు ప్రాజెక్టులో పడి యువకుడి మృతి



రాజశేఖర్ గౌడ్ (ఫైల్)

ధర్పల్లి: మండలంలోని రామడుగు ప్రాజెక్ట్‌లో స్నానానికి వెళ్లి ఊపిరాడక ఒక యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సిరికొండ గ్రామానికి చెందిన రాజశేఖర్ గౌడ్ (28) స్నేహితులతో కలిసి చేపలు పట్టేందుకు బుధవారం మధ్యాహ్నం రామడుగు ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. మొదట స్నానం చేయడానికి రాజశేఖర్ గౌడ్ నీటిలో దూకాడు. ప్రాజెక్టు లోతు ఎక్కువగా ఉండటంతో బయటకు రాలేదు. స్నేహితులు, స్థానికుల సహాయంతో రాజశేఖర్ గౌడ్‌ను బయటకు తీసుకురాగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

### బైక్‌ను ఢీకొన్న కారు.. ఒకరి మృతి

ఎడపల్లి(బోధన్): కారు అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై వంశీ చందర్‌రెడ్డి తెలిపారు. బోధన్ పట్టణానికి చెందిన నిమ్మగడ్డ రమేశ్(59) ఎడపల్లి శివారులోని సరయు ఫంక్షన్ హాల్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా నిజామాబాద్‌కు చెందిన రాజేశ్ కారును అతివేగంగా నడిపి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో నిమ్మగడ్డ రమేశ్ అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి మామ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### సాటాపూర్‌లో కార్డన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ గ్రామంలో బుధవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీపీ ఆదేశాల మేరకు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం చేపట్టారు. నాలుగు ఆటోలు, 80 ద్విచక్ర వాహనాలకు ధ్రువపత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మోటారు వాహన నిబంధనలు పాటించాలని సూచించారు. లేనిపక్షంలో జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఓ ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీ చేసి 45 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎస్సైలు చంద్రమోహన్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

### బైక్‌ల చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల ఇంటి ఎదుట పార్క్ చేసిన రెండు బైక్‌లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నగరంలోని షిర్డీ సాయికృపా నగర్ కాలనీలో సాదుల్లా శేఖర్ ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు చేశారు. బోర్గాం సమీపంలోని గ్రామిక్‌నగర్‌లో రాములు ఇంటి ఎదుట బైక్‌ను పార్కింగ్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



### ఆగి ఉన్న లారీని ఢీకొన్న కంటెయినర్

- డ్రైవర్ మృతి, క్లీనర్‌కు తీవ్ర గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కంటెయినర్

కామారెడ్డి క్రైం: సాంకేతిక సమస్య తలెత్తడంతో రోడ్డుపై ఆగి ఉన్న లారీని అతి వేగంగా వచ్చిన ఓ కంటెయినర్ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో కంటెయినర్ డ్రైవర్ మృతి చెందగా క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కామారెడ్డి సమీపంలోని టేక్రియాల్ బైపాస్‌కు కొద్ది దూరంలో బుధవారం వేకువజామున 5 గంటల ప్రాంతంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్తాన్‌కు చెందిన ఓ లోడ్ లారీ హైదరాబాద్ వైపు వెళ్తోంది. అదే దారిలో అతివేగంగా వచ్చిన ఓ మహారాష్ట్రకు చెందిన కంటెయినర్.. లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో కంటెయినర్ ముందు భాగం నుజ్జునుజ్జయింది. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. తీవ్రంగా గాయపడిన కంటెయినర్ డ్రైవర్ సచిన్ జవార్‌సింగ్(30), క్లీనర్‌ను కామారెడ్డి జనరల్ ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే డ్రైవర్ సచిన్ జవార్‌సింగ్ మరణించాడు. ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతోనే లారీ రోడ్డుపై ఆగిపోయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

# అమ్మో.. ముప్కాల్ తహసీల్!




ముప్కాల్ మండల తహసీల్ కార్యాలయం

- ఏడేళ్లలో 10 మంది తహసీల్దార్ల బదిలీ
- భూ వివాదాల నేపథ్యంలో హడలెత్తిపోతున్న అధికారులు
- ఏడాది తిరగక ముందే బదిలీపై వెళ్తున్న వైనం

బాల్కొండ : ముప్కాల్ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించేందుకు అధికారులు జంకుతున్నారు. నూతన మండలాల ఏర్పాటులో భాగంగా 2018లో ముప్కాల్ మండలం ఏర్పడింది. కాగా, సుమారు ఏడేళ్లలోనే 10 మంది తహసీల్దార్లు వచ్చారు.. బదిలీపై వెళ్లిపోయారు. మూడు రోజుల క్రితం మూడు నెలలుగా తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న గజానన్ బదిలీపై నిర్మల్ వెళ్లారు. దీంతో ప్రస్తుతం ముప్కాల్ తహసీల్దార్ పోస్టు ఖాళీ అయింది.

**దీర్ఘకాలిక సెలవు..లేదంటే బదిలీ**

ముప్కాల్ మండల పరిధిలో ఉండేది ఏడు గ్రామాలే అయినా, నిత్యం భూ వివాదాలు, ప్రభుత్వ భూముల కబ్జాలపై ఫిర్యాదులు వస్తుంటాయి. రాజకీయ ఒత్తిళ్లు సైతం ఈ మండలంలో ఎక్కువే. దీంతో ఇక్కడ విధులు నిర్వర్తించే తహసీల్దార్లు దీర్ఘకాలిక సెలవుపై వెళ్తుంటారు. లేదంటే మరో ప్రాంతానికి బదిలీ చేయించుకుంటున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి భూ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు బంగారు పతకం



రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ చాంపియన్ ట్రోఫీతో జిల్లా జట్టు క్రీడాకారులు

నిజామాబాద్ నాగారం: మెదక్ జిల్లా తూప్రాన్‌లోని టీజీఆర్‌ఎస్ మైదానంలో ఈనెల 21 వరకు జరిగిన 11వ రాష్ట్ర జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు విజేతగా నిలిచి బంగారు పతకం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో మెదక్ జిల్లా జట్టుపై తలపడి 06–01 పరుగుల తేడాతో విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. ముఖ్య అతిథిగా హాజరైన తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ గణేశ్ రెడ్డి, సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ కె శోభన్ బాబు, తెలంగాణ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు డి అభిషేక్ గౌడ్, మెదక్ జిల్లా అధ్యక్షుడు నారాయణ గుప్తా జిల్లా క్రీడాకారులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన జిల్లా జట్టును జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర ఉత్తమ పిక్చర్ చందు (బోధన్) ప్రత్యేక బహుమతి అందుకున్నాడు. జట్టుకు కోచ్ మేనేజర్లుగా ఈ నరేశ్, వినయ్, తిరుపతి వ్యవహరించారు.

## కంబోడియాలో దేవునిపల్లి యువకుడి మృతి

- 14న గుండెపోటుతో మరణం
- కుటుంబ సభ్యులకు ఆలస్యంగా సమాచారం



భూంరావుగారి కిరణ్‌కుమార్ (ఫైల్)

కామారెడ్డి అర్బన్: కంబోడియా రాజధాని నాంఫెన్‌లో కామారెడ్డి పట్టణం దేవునిపల్లికి చెందిన భూంరావుగారి కిరణ్‌కుమార్ (36) ఈ నెల 14న గుండెపోటుతో మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉపాధి కోసం కంబోడియా వెళ్లిన కిరణ్‌కుమార్ నాంఫెన్‌లో గుండెపోటుతో మరణించిన విషయం భారతీయ రాయబార కార్యాలయం ద్వారా పోలీసులకు సమాచారం అందించగా వారు సరిగ్గా స్పందించలేదని తెలుస్తుంది. దేవునిపల్లిలోని కిరణ్‌కుమార్ ఇంటికి పోలీసులు నేరుగా వచ్చి వివరాలు తెలుసుకోకుండా స్టేషన్‌కు వచ్చి కలవాలని ఫోన్ చేయడంతో సరైనపత్రాలు లేక భయపడిన కుటుంబసభ్యులు మధ్యవర్తుల ద్వారా రెండుమూడు రోజులకు కలిశారు. కాగా, తెలిసిన బంధువుల ద్వారా కంబోడియాలోని భారత రాయబార కార్యాలయం కౌన్సిలేట్ అబ్రహంతో మాట్లాడగా ఆయన కిరణ్‌కుమార్ మృతదేహం తరలింపునకు కావాల్సిన పత్రాల ఫార్మేట్ పంపినట్టు చెబుతున్నారు. మృతదేహాన్ని త్వరగా తెప్పించేందుకు కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిల ద్వారా ప్రయత్నాలు ప్రారంభించారు. మృతుడి గుర్తింపు పత్రాలు పంపిన తర్వాత శవం ఇంటికి చేరుకోవడానికి వారం రోజులు పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. కిరణ్‌కుమార్‌కు తల్లిదండ్రులతోపాటు భార్య, ఇద్దరు కొడుకులున్నారు.

## వేధింపులు భరించలేక కొడుకును హత్య చేశాడు

**ఏఎస్పీ చైతన్య రెడ్డి**



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్య రెడ్డి

కామారెడ్డి క్రైం: జులాయిగా తిరుగుతూ డబ్బుల కోసం నిత్యం వేధించడంతోనే సొంత కొడుకును తండ్రి హత్య చేసినట్లు విచారణలో తేలింది. మూడు రోజుల క్రితం కామారెడ్డి మండలం లింగాపూర్ గ్రామంలో జరిగిన వడ్ల నిఖిల్ (24) హత్య కేసులో నిందితుడైన తండ్రి భాస్కర్‌ను రూరల్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కామారెడ్డి సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ చైతన్య రెడ్డి వివరాలు వెల్లడించారు. లింగాపూర్ గ్రామానికి చెందిన భాస్కర్‌కు కుమార్తె, కుమారుడు ఉన్నారు. గతంలో కుమార్తెకు పెళ్లి చేశారు. కొడుకు నిఖిల్ జులాయిగా తిరుగుతుండటంతో ఏడాది క్రితం గల్ఫ్‌కు పంపారు. అక్కడ కూడా ఎక్కువ రోజులు ఉండకుండా తిరిగి వచ్చేశాడు. వచ్చిన నాటి నుంచి గ్రామంలో జులాయిగా తిరుగుతూ ఏపనీ చేసేవాడు కాదు. పైగా మద్యానికి బానిసై నిత్యం తల్లిదండ్రులను డబ్బుల కోసం వేధించేవాడు. దీంతో పలుసార్లు తండ్రీకొడుకుల మధ్య గొడవ జరిగింది. గత ఆదివారం రాత్రి గొడవ జరిగినప్పుడు భాస్కర్ అక్కడే ఉన్న ఓ కర్రతో నిఖిల్ తలపై కొట్టాడు. బలమైన గాయం కావడంతో వెంటనే కామారెడ్డి జనరల్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చారు. నిఖిల్ బతికి ఉంటే తమను ప్రశాంతంగా ఉండనివ్వడని భావించిన తండ్రి భాస్కర్ అతడిని ఎలాగైనా చంపేయాలని అనుకున్నాడు. సోమవారం వేకువజామున రాడ్డుతో మరోసారి నిఖిల్‌పై దాడి చేశాడు. తీవ్రగాయాలైన నిఖిల్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లగానే చనిపోయాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న భాస్కర్‌ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. కేసును తక్కువ సమయంలోనే ఛేదించిన రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బందిని అభినందించారు.

## భార్యపై హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు

కామారెడ్డి క్రైం: భార్యపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో భర్తకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా ఉన్నాయి. గాంధారి మండలం మర్లకుంట తండాకు చెందిన స్వాతికి మాచారెడ్డి మండలానికి చెందిన విస్లావత్ లచ్చీరాంతో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. లచ్చీరాం మద్యానికి బానిసై అదనపు కట్నం తేవాలని తరచూ భార్యను వేధించేవాడు. దీంతో స్వాతి తల్లిగారింటి వద్దనే ఉంటూ గాంధారిలో టైలరింగ్ నేర్చుకునేది. 2022 ఫిబ్రవరి 26న టైలరింగ్ నేర్చుకునే చోటికి కత్తితో వచ్చిన లచ్చీరాం.. స్వాతిపై దాడి చేశాడు. అక్కడున్న వారు అడ్డుకొని తీవ్రగాయాలైన స్వాతిని ఆస్పత్రిలో చేర్పించారు. గాంధారి పోలీసులు కేసు నమోదు చేసి లచ్చీరాంను రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. నేరం రుజువు కావడంతో కామారెడ్డి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సుమలత నిందితుడికి 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. సరైన పద్ధతిలో కేసు విచారణ చేపట్టిన అప్పటి గాంధారి ఎస్సై సాయిరెడ్డి, ప్రస్తుత ఎస్సై ఆంజనేయులు, పీపీ దామోదర్ రెడ్డి, కోర్టు లైజనింగ్ అధికారి ఎస్సై రామేశ్వర్ రెడ్డి, సిబ్బందిని ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

### విద్యుదాఘాతానికి రైతు బలి



భుక్య రాజు నాయక్ (ఫైల్)

రామారెడ్డి: విద్యుదాఘాతానికి ఓ రైతు బలైన ఘటన రామారెడ్డి మండలంలోని ఘన్‌పూర్ తండాలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన భుక్య రాజు నాయక్(35) బుధవారం మధ్యాహ్నం పొలంలో విరిగిపోయిన చెట్లను తొలగిస్తుండగా, మంగళవారం కురిసిన వర్షానికి తెగిపడిన విద్యుత్ వైర్లకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు నాయక్ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలానికి వెళ్లి చూడగా విగత జీవిగా పడి ఉన్నాడు. మృతుడికి భార్య వనీత, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.